ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కుమరం భీం
జిల్లా వార్తలు
8
మంగళవారం 24 డిసెంబరు 2024

బాలలు వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి

వాంకిడి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బాలలపై జరిగే లైంగిక దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లాబాలల సంరక్షణవిభాగం సోషల్‌వర్కర్ డోంగ్రి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లాబాలల సంరక్షణవిభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ సంయుక్తఆధ్వర్యంలో స్థానికప్రభుత్వ జూనియర్‌కళాశాలలో విద్యార్థులకు ప్రస్తుతం బాలలు ఎదుర్కొంటున్న సమస్యల, సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో పోలీసులకు, 1098కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు శ్రీధర్, కిరణ్, సభ్యులు నాసిర్, ఉస్మాన్, పితాంబర్, సుగుణ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఎదుట ఈనెల 10నుంచి చేపట్టిన ఎస్ఎస్ఏఉద్యోగుల దీక్షలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా వారికి సోమవారం, సిర్పూర్ (యు) ఎంఈవో ప్రకాష్, సీపీఎస్ సంఘం అధ్యక్షుడు అజయ్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగులు మోహన్, నాగసుధ, తుకారాం, నాగేష్, సంతోష్, సందీప్, పవన్, రాజేష్, ప్రశాంత్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్ముగూడ గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో సోమవారం జాతీయరైతుదినోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీనిర్వహించి జాతీయరైతు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్నూరుకాపుసంఘం నాయకులు వెంకన్న, సురేష్, జక్కయ్య, వెంకన్న, శంకర్, సతీష్, సదాశివ్, ప్రహ్లాద్, శంకర్, మధుకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీవో60 ప్రకారం వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆర్‌పీలు

ఆసిఫాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ నిరుపేద నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ఆర్‌పీలకు జీవో60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లాకార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో ఆర్‌పీలు ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. వారికి ఉద్యోగభద్రత కల్పించాలని, పదిలక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్పీల యూనియన్ అధ్యక్షురాలు సునీత, నాయకులు స్వర్ణలత, మాధురి, రమ్యశ్రీ, శైలజ, రమ, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

రెబ్బెన, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమిత్‌షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదన్నారు. వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అంబేద్కర్‌సంఘం అధ్యక్షుడు మొండి, మాజీజడ్పీటీసీ దుర్గం సోమయ్య, వేముర్ల సంతోష్, మాజీ ఎంపీటీసీ మధునయ్య, మాజీ సర్పంచి గంటమేర, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీక్రిస్మస్ వేడుకలు



ప్రీక్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్ బాబు


కాగజ్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్ బాబు కేక్‌కట్ చేసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా చర్చిల పాస్టర్లు, ఫాదర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రెబ్బెన: రెబ్బెన ఆగెపెసలం చర్చిలో జిల్లా కాంగ్రెస్‌నాయకుడు అనిల్‌గౌడ్ కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రామయ్య, రెబ్బెన మండల అధ్యక్షుడు లావుడ్య రమేష్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, మాజీసర్పంచి సోమశేఖర్, జిల్లా యూత్ ప్రధానకార్యదర్శి ఎర్రం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండలకేంద్రంలోని నజ్రత్‌మిషన్ పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ స్టీవెన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు శాంతి మార్గంలో నడవాలని, విద్యార్థులు చిన్ననాటి నుంచే సామాజిక, సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు.

సాదాబైనామాలపై ఆశలు

- పెండింగ్ దరఖాస్తులకు మోక్షం
- భూభారతితో ప్రభుత్వంపై పెరుగుతున్న ఆశలు



తెల్లకాగితాలపై భూములు కొనుగోలు చేసిన వారి కష్టాలు గట్టెక్కనున్నాయి. ఇన్ని రోజులు ప్రభుత్వ రికార్డుల్లో వారి పేర్లు లేకపోవడంతో ఎలాంటి పథకాలు పొందలేకపోయారు. ఇప్పుడు ప్రభుత్వం కొత్తగా భూభారతి 2024చట్టం తీసుకొస్తోంది. దీనిద్వారా సదరు వ్యక్తులకు అన్నిరకాల హక్కులు లభించనున్నాయి.

తెలంగాణ
భూభారతి
భూమిపై హక్కుల రికార్డు చట్టం-2024

కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 23: సాదాబైనామా ప్రక్రియతో అందరిలో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం కొత్తగా భూభారతి 2024చట్టం అమలులోకి తీసుకువస్తున్న నేపథ్యంలో తెల్లకాగితాలపై రాసుకొని భూములు కొనుగోలు చేసిన వారి సమస్యల పరిష్కారానికి మోక్షం లభించనుంది. నూతన ఆర్వోఆర్ చట్టంలో కొన్ని సవరణలు చేసి ఆ స్థానంలో భూభారతిని తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టింది. సులభతరంగా భూసమస్యలు పరిష్కరించుకునే విధంగా చట్టం తీసుకువస్తోంది. దీంతో జిల్లావ్యాప్తంగా కాగితాలపై భూములు కొనుగోలు చేసిన వారి సమస్యలు పరిష్కామయ్యే అవకాశాలున్నాయి.

ఏళ్లుగా ఎదురు చూపులు..

జిల్లావ్యాప్తంగా సాదాబైనామాలతో భూములు కొనుగోలు చేసిన వారికి గత ప్రభుత్వంలో చేసుకున్న దరఖాస్తులకు మోక్షం లభిస్తే వారి ఆనందానికి అవధులు ఉండవు. జిల్లా వ్యాప్తంగా సుమారు 20వేలపైగా దరఖాస్తులు ఉన్నట్లు అంచనా. తాజాగా ప్రవేశపెట్టిన భూభారతి బిల్లులో 2014జూన్2కు ముందు తెల్ల కాగితాలపై కొనుగోలు చేసిన భూములన్నింటిని క్రమద్దీకరించేందుకు ఈ చట్టం సవరించారు. గతంలో ఈ సమస్యలన్నింటిపై దరఖాస్తులు స్వీకరించారు. ఏళ్లుగా వాటికి పరిష్కారం లభించకపోవడంతో రెవెన్యూ కార్యాలయాల్లోనే దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయి. తాజాగా తెచ్చిన చట్టం ద్వారా వీటిని పరిష్కరించే అవకాశాలున్నాయి.

అన్నిరకాల సమస్యలకు పరిష్కారం..

భూభారతి చట్టం అమలులోకి వస్తే తెల్లకాగితాలపై భూములు కొనుగోలు చేసిన వారికి భూ హక్కులు వర్తించనున్నాయి. క్షేత్రస్థాయిలో సాగు చేసుకుంటున్నప్పటికీ రికార్డులో వారిపేర్లు లేవు. దీంతో వారికి ప్రభుత్వపథకాలు అందడం లేదు. రికార్డుల్లో భూమి ఉండి వారికి విక్రయించిన వారికి కూడా యాజమాన్య హక్కులు లేకుండాపోయాయి. దీంతోపాటు క్షేత్రస్థాయిలో భూములు విక్రయించిన వారసులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్ని సంఘటనలు పోలీసు స్టేషన్‌ల వరకు వెళుతున్నాయి. అసలు పట్టాదారులకు సంబంధించిన వారసులు, సంబంధీకులు తెల్లకాగితాలు, బాండు పేపర్లపై భూములు కొనుగోలు చేసిన వారి నుంచి తిరిగి భూములు తీసుకోవడం లాంటి సమస్యలున్నాయి. ఇలా అనేకరకాల ఇబ్బందులు తలెత్తకుండా భూభారతి చట్టం ద్వారా వెసులు బాటు కలుగుతుంది. ఈ చట్టం అమల్లోకి వస్తే భూసమస్యల్లోని తీవ్రమైన సమస్యలకు పరిష్కారం కలుగనుంది.

ధరణిలో కనిపించని ఆప్షన్లతో ఇబ్బందులు..

గతప్రభుత్వం 2020లో ధరణి పోర్టల్ తీసుకొచ్చి దాని ద్వారానే భూ నిర్వహణను కొనసాగించింది. అయితే ధరణిలో అన్నిరకాల ఆప్షన్లు లేకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాదాబైనామాలకు కూడా రైతులు, ఇతరులు రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ఆప్షన్లు లేకపోవడంతో ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. చర్యలు తీసుకుంటామని అప్పటి ప్రభుత్వం కేవలం దరఖాస్తులు తీసుకొని అలాగే వదిలేసింది. కొత్త చట్టం పకడ్బందీగా అమలు చేస్తే భూ భారతితో మేలు కలుగుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనార్టీఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తిపథకం ద్వారా మైనార్టీ మహిళలకు ఉచితకుట్టు శిక్షణ అందించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా అల్పసంఖ్యాకవర్గాల సంక్షేమాధికారిణి రమాదేవి ఒకప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను జిల్లా కేంద్రంలోని మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ టీచర్ల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంగన్‌వాడీటీచర్లు కలెక్టరేట్‌ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్‌హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివేణి మాట్లాడుతూ అంగన్‌వాడీటీచర్లకు పూర్తివేతనం చెల్లించే విధంగా ఆర్థికశాఖ ట్రెజరీలలో అప్‌డేట్ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, రాజేందర్, అంగన్‌వాడీటీచర్లు పాల్గొన్నారు.

సిర్పూర్(యు)లో 12.5డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

ఆసిఫాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్నిరోజులుగా చలితీవ్రత కాస్త తగ్గుముఖం పట్టింది. సోమవారం సిర్పూర్(యు) మండలంలో 12.5 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదయింది. తిర్యాణిలో 12.6డిగ్రీలు, కెరమెరిలో 13.3 డిగ్రీలు నమోదు అయ్యాయి.

ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే



కాగజ్‌నగర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

ఆసిఫాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దహెగాం మండలానికి చెందిన చంద్రయ్య మండలంలో అనర్హులకు కల్యాణ లక్ష్మి పథకం వర్తింపజేశారని, ఈ విషయంలో విచారణజరిపి చర్యలు తీసుకోవాలని దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం వంకులం గ్రామస్థులు రాళ్లపేట గ్రామ పంచాయతీని విడదీసి నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని అర్జీ సమర్పించారు. పెంచికలపేట మండలం గుండెపల్లి గ్రామస్థులు వందశాతం గిరిజనులు నివసిస్తున్నందున కమ్మర్‌గాంను గ్రామపంచాయతీ నుంచి తొలగించి నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని జన్కాపూర్‌కుచెందిన కార్తీక్ ఇంటి నిర్మాణం కొరకు మున్సిపల్ అనుమతి ఇప్పించాలని అర్జీసమర్పించారు. కాగజ్‌నగర్ మండలం బారెగూడ గ్రామానికి చెందిన కవిత మండల్ తనపేరిటఉన్న పట్టాభూమిలో అయిదుగుంటల భూమిని తొలగించి నందున సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చింతలమానేపల్లి మండలం రన్‌వెల్లికి చెందిన శ్యాంరావు తన పేరిట పట్టా భూమిని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని వారిపైచర్యలు తీసుకవాలని కోరారు. రాజంపేట గ్రామానికి చెందిన పద్మ తనకు వితంతు పెన్షన్ ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన అబిద్‌ఖాన్ సదరం శిబిరం కొరకు స్లాట్ బుకింగ్ కానందున బుక్కింగ్ అయ్యేలా చూడాలని, కెరమెరి మండలం సుర్దాపూర్‌కు చెందిన నాందేవ్ దివ్యాంగ సర్టిఫికేట్ ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధితశాఖల అధికారులు సమన్వయంతో త్వరగా పరిష్కరించాలన్నారు.

కాగజ్‌నగర్: ప్రజావాణిలో ప్రజలనుంచి వచ్చిన సమస్యలను అధికారులు త్వరగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజా వాణిలో వచ్చిన అర్జీలను ఎప్పకటిప్పుడు క్లియర్ చేయాలన్నారు. ఈ విషయంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ఎగుమతి సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతుల సామర్థ్యాన్ని పెంచే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఎగుమతుల సామర్థ్యం పెంపు అంశంపై అధికారులు, పారిశ్రామికవేత్తలు, ఎస్పీఎం ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిర్పూర్‌పేపరు మిల్లునుంచి సుమారు 1200టన్నుల కాగితం(రూ.7కోట్ల విలువ) ఉత్పత్తులు దుబాయి, ఒమన్ లాంటి దేశాలకు ఎగుమతిచేశామన్నారు. ఈ ప్రాంతంలో లభించే నాణ్యమైనపత్తి అధికంగా బంగ్లాదేశ్‌కి ఎగుమతి అవుతోందన్నారు. నాణ్యమైన బియ్యాన్ని పండించడం ద్వారా బంగ్లాదేశ్, ఉగాండ, మలేషియా, సింగపూర్ దేశాలలో మనదేశం ధాన్యానికి మంచిడిమాండ్ ఉందన్నారు. తద్వారా రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతోందన్నారు. ఈక్రమంలో పంటసాగుకు రైతులను ప్రోత్సహిస్తూ అధికదిగుబడి సాధించే విధంగా సన్నద్ధం చేయాలన్నారు. వెదురుతో తయారు చేసిన అలంకరణ వస్తువులు, చిరుధాన్యాలు, తేనేలాంటి ఉత్పత్తులకు జిల్లా అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన ఉత్పత్తుల ఉత్పాదకతను పెంచి ఎగుమతి సామర్థ్యాన్ని పెంపొందించవచ్చన్నారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ ఎం అశోక్, డీఆర్‌డీవో దత్తరాం, ఏపీడీ రామకృష్ణ, మత్స్యశాఖ ఏడీ సాంబశివరావు, ఉద్యానవన అధికారి నదీం, సిర్పూర్‌పేపరు మిల్లు ప్రతినిధులు, రైసుమిల్లుల, జిన్నింగ్ మిల్లుల యాజమానులు పాల్గొన్నారు.

వన్యప్రాణులకు హాని కలిగించొద్దు

కెరమెరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులకు హాని కలిగించవద్దని అటవీ రేంజ్ అధికారి మజారోద్దీన్ అన్నారు. సోమవారం ఝరిగ్రామంలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన్య మృగాలకు, అటవీజంతువులకు హాని కలిగించిన వారిపై చట్ట రిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అడవికి నిప్పు పెట్టవద్దని, అటవీసంపదను పెంపొందించాలన్నారు. ఆయన వెంట అటవీ అధికారులు, రామయ్య, సిబ్బంది ఉన్నారు.

వన్యప్రాణుల రక్షణ మనందరి బాధ్యత

లింగాపూర్: వన్యప్రాణుల రక్షణ మనందరి బాధ్యతని ఇస్లాంపూర్‌సెక్షన్ అధికారి ఆసుశా, బీట్ అధికారి మహేందర్ అన్నారు. సోమవారం వారు మండలంలోని పిక్లా తండా, హిరాపూర్, కొత్తపల్లితదితర గ్రామాల్లో పర్యటించి వన్యప్రాణుల పరిరక్షణ బాధ్యత మనందరిపై ఉందని అవగాహన కల్పించారు.

పూలాజీబాబా చూపిన బాటలో నడవాలి

వాంకిడి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పూలాజీ బాబా సూచించిన ఆధ్యాత్మికమార్గంలో నడవాలని సిద్దేశ్వర్ సంస్థాన్ పాట్నాపూర్ అధ్యక్షుడు, పూలాజీబాబా తనయుడు కేశవ్‌రావు ఇంగ్లే అన్నారు. మండలంలోని కోమటిగుడ గ్రామంలో 17వ ధ్యానకేంద్ర వార్షికోత్సవం సందర్భంగా నూతనంగా నిర్మించిన ధ్యానకేంద్రం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కోమటిగూడధ్యానకేంద్రకమిటీ సభ్యులు గుర్నులేమెంగాజీ,వెంకట్‌రావు,పురుషోత్తం,తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శివాలయం 51వ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

కౌటాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సదాశివపేట శివాలయం 51వవార్షికోత్సవం కొనసాగుతోంది. సోమవారం 116జంటలతో హోమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానఅర్చకుడు శంకరయ్య, సంతోష్ ఆధ్వర్యంలో వేదపండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకలకు జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్రలోని దాబా, అహిరి నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. ప్రతిరోజు మహా అన్నప్రసాదాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం మహా అగ్నిగుండాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

హక్కు పత్రాలు అందించాలి

బెజ్జూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడీగూడ గ్రామానికిచెందిన ఆదివాసీ రైతులు పోడుసాగుచేసుకుంటున్న భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని సోమవారం ఐటీడీఏపీవో కుష్బుగుప్తాకు వినతిపత్రం అందజేశారు. తమలో కొంతమందికి మాత్రమే హక్కుపత్రాలు ఇచ్చారన్నారు. అధికారుల వేధింపులకు పాల్పడుతుండడంతో భూములు సాగు చేయకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పత్రాలులేక బ్యాంకుల్లో రుణాలుసైతం పొందడం లేదన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులుశ్రీనివాస్,లచ్చన్న,సకారాం,మారయ్య పాల్గొన్నారు.

వ్యవసాయాధికారులకు శిక్షణ

ఆసిఫాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి):జిల్లాలో వ్యవసాయాధికారులు, రైతులకు జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ రైతువేదికలో హైదరాబాద్ సెంట్రల్ ఇంటిగ్రెటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌పీఎస్(నేషనల్ పెస్ట్‌సర్వేలైన్స్‌సిస్టం) మొబైల్ అప్లికేషన్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ అప్లికేషన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు వెంకట్‌రెడ్డి, హోనప్పగౌడ్, శ్రీనివాసరావు, మిలింద్‌కుమార్, ఏఓలు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

మండలాల్లో పెద్దపులి, చిరుతల సంచారం..

- భయం గుప్పిట్లో అటవీగ్రామాలు



పెద్దపులి పాదముద్ర

పెంచికలపేట/ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పెంచికలపేట మండలంలోని కొండపల్లి, ఎర్రగుట్ట, పోతెపల్లి, దర్గపల్లి, లోడ్‌పల్లి గ్రామాల్లోని అటవీప్రాంతాల్లో సోమవారం పులి కదలికలు కలకలం రేపాయి. అటవీ అధికారులు తెలిపిన సమాచారం మేరకు.. ఆదివారం రాత్రి కొండపల్లి అటవీప్రాంతంలో ట్రాకింగ్ చేస్తుండగా పులిపాదముద్రలు గుర్తించారు. వాటిని అనుసరిస్తూ వెళ్లగా ఎర్రగుంట గ్రామశివారు పత్తిచేనుల వెంట ఓకుంట వద్ద నీళ్లుతాగి మళ్లీ సమీపఅటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయినట్లు గుర్తించారు. సోమవారంఉదయం అధికారులు సిబ్బందితోకలిసి పులి సంచరించిన ప్రాంతాల్లో పాదముద్రలు గుర్తించారు.

మాణిక్‌గూడ పరిసరాల్లో చిరుత సంచారం..

ఆసిఫాబాద్ మండలంలోని మాణిక్‌గూడ పరిసర ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు అటవీరేంజ్ అధికారి గోవింద్‌చంద్ సర్దార్ తెలిపారు. అటవీశాఖాధికారులు గ్రామపరిసర ప్రాంతాల్లోని అడవిలో చిరుతపులి అడుగులు గుర్తించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సాయంత్రం పూట అటవీపరిసర ప్రాంతాల్లోకి వెళ్లకూడదన్నారు. పత్తి ఏరే రైతులు శబ్ధాలు చేసుకుంటూ చేనులలో పనిచేయాలన్నారు. చేనులలో ఎవరు కూడా కరెంటు వైర్లు అమర్చ కూడదని, అలాచేస్తేచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీరేంజ్ అధికారి యోగేష్, బీట్ అధికారి రాజేష్‌తో పాటు అనిమల్ ట్రాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తోనే పర్యావరణ సమస్యలు

- ఎస్పీఎం సీఎస్ఆర్ యూనిట్, స్పర్శ ఫౌండేషన్ మేనేజర్ రీనా బిల్వాల్



బహుమతులు పొందిన విద్యార్థులతో స్పర్శ ఫౌండేషన్ మేనేజర్ రీనా బిల్వాల్, ఎంఈవో ప్రభాకర్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్ తదితరులు


కాగజ్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌తోనే పర్యావరణ సమస్యలు వస్తున్నాయని ఎస్పీఎం సీఎస్ఆర్ యూనిట్ స్పర్శ ఫౌండేషన్ మేనేజర్ రీనా బిల్వాల్ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వాడకంతో దీర్ఘకాలిక వ్యాధులు, ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధి వస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాలన్నింటిపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహణ పరుస్తున్నామన్నారు. అలాగే పాఠశాలల్లో వివిధకార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలి పారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై చేపట్టిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఎంఈవో ప్రభాకర్, జిల్లాసైన్స్ అధికారి మధూకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో స్పర్శ ఫౌండేషన్ ప్రతినిధులుసుశీల,శివకుమార్‌తో పాటు విశ్వశాంతి పాఠశాల కరస్పాండెంట్ లంక కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

కాగజ్‌నగర్: పట్టణంలోని శ్రీవిశ్వశాంతి హైస్కూల్‌లో సోమవారం విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ ప్రయోగాలు ప్రదర్శించారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి మధూకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు సైన్స్‌ఫెయిర్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. పోటీపడి నూతనఆవిష్కరణలు చేస్తు న్న విద్యార్థులను అభినందించారు. ఎంఈవో ప్రభాకర్ మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగచేసుకోవాలని కోరారు. కళాశాల కరస్పాండెంట్ లంక కృష్ణ ప్రసాద్, అడ్మినిస్ట్రేటర్ ఇందిర దేవి, రమాదేవి, నేహసర్కార్, ఆయుబ్‌ఖాన్, నాగరాణి, సింధు, శ్రీవాణి, నవిత తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్..

సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థుల ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. గగనతలంలో విమానాలకు పక్షులు అడ్డురాకుండా ముందస్తుగానే రాడర్‌ద్వారా కనుగొనే పరికరాన్ని ఆవిష్కరించారు. సౌరశక్తిద్వారా ట్రాఫిక్ వ్యవస్థలో సోలార్ లాంప్‌లు ఆవిష్కరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.



విద్యార్థులు ఆవిష్కరించిన రాడర్ సిస్టం

నేడు ఉచిత నేత్ర శస్త్రచికిత్స శిబిరం

దహెగాం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం బెల్లంపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్రశస్త్ర చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కోచైర్మన్ సిద్ధుగౌడ్ తెలిపారు. మండలంలోని ప్రజలు ఈశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతిఒక్కరు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతిని తీసుకురావాలన్నారు.

ఎస్టీ హాస్టల్ అధికారులకు షోకాజ్ నోటీసులు

కాగజ్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ ఆశ్రమోన్నత పాఠశాలలో శనివారం భోజనంలో విద్యార్థులకు కూర లేకుండా కారం పెట్టినందుకు అలాగే కిచిడి ఉడకనందుకు నిర్లక్ష్యం వహించిన అధికారులకు సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా షోకాజ్ నోటీసులను జారీచేశారు. విద్యార్థుల పట్ల ఎందుకు నిర్లక్ష్యం వహించారో వెంటనే వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

క్రైం కార్నర్

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

నస్పూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన కొయ్యల శ్రీనివాస్ (43) సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుడప్పుడు ఫీట్స్ వస్తుండడంతో ఏ పని చేయడంలేదు. మద్యం తాగుతూ జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులు తలుపు తెరిచి చూసే సరికి ఉరివేసుకుని ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. భార్య కొయ్యల రూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

బెల్లంపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాల్‌టెక్స్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై సోమవారం రాత్రి బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. బెల్లంపల్లి నుంచి తాండూర్ వైపు ద్విచక్రవాహనంపై రేచిని గ్రామానికి చెందిన సాయికిరణ్, వంశీలు వెళ్తుండగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చెట్టును ఢీకొన్న కారు : ముగ్గురికి గాయాలు

జన్నారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండలంలోని పైడిపల్లి అటవీ ప్రాంతంలో జన్నారం నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న కారు అతి వేగంగా అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో కారు ఇంజన్ విడిపోయింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాల య్యాయి. గాయాలైన వారు మంచిర్యాలకు చెందిన వారని తెలిసింది. ఎస్‌ఐ రాజవర్దన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

యువకులపై పోలీసుల వేధింపులు సరికాదు

మందమర్రి టౌన్, డిసెంబర్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆవుల షారుక్, మెస్రం రాజు, బామండ్ల శివ, సెగ్గెం అజయ్‌కుమార్‌లను పోలీసులు వేధించడం సరికాదని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భుజంగరావు, తిరుపతిలు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల పోలీసుల వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని, దీనిపై మానవ హక్కుల వేదిక వివరాలు సేకరించిందన్నారు. బెయిల్‌పై ఉన్న వారిని వారానికి రెండు సార్లు స్టేషన్‌కు రప్పించి కొత్త కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పోలీసులు వాస్తవాలను తెలుకోవాలని, వేధింపులను మానుకోవాలని అన్నారు.

పోతనపల్లిలో కార్డెన్ సెర్చ్

భీమారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పోతనపల్లి గ్రామంలో ఎస్‌ఐ శ్వేత కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనాల ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. పెండింగ్ చలాన్‌లు ఉంటే చెల్లించాలని, లేకుంటే వాహనాలను అదుపులోకి తీసుకుంటామన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సెకండ్ ఎస్‌ఐలు నాగరాజు, వసంత్, హెడ్ కానిస్టేబుల్ మాచర్ల తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజ అమ్మితే కఠిన చర్యలు

భీమారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గాలిపటాల దుకాణాల్లో చైనామాంజ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎఫ్ఆర్‌వో సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గాలిపటాల దుకాణాలను తనిఖీ చేశారు. మాంజ దారాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చైనా మాంజ అమ్మవద్దని సూచించారు. సైనామాంజ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఎఫ్‌బీవోలు శివకుమార్, బానేష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు మేథోశక్తిని పెంపొందించుకోవాలి

తాండూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మేథోశక్తిని పెంపొందించుకోవాలని ఎంఈవో మల్లేశం, ఎస్‌ఐ కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం విద్యాభారతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫెస్టివల్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. రానున్న రోజుల్లో జరిగే పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని సూచించారు. పాఠశాల కరెస్పాండెంట్ సురభి శరత్‌కుమార్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణికి నాలుగు దరఖాస్తులు

కాసిపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నాలుగు దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో సత్యనారాయణసింగ్ తెలిపారు. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్‌లో రొటేషన్ పద్ధతిలో నిర్వహించాలని సల్లూరి ప్రభాకర్ వినతి పత్రం అందించాడు. మండల కేంద్రానికి చెందిన మారం కుమార్ 9 ఎకరాల భూమిని కబ్జా చేశాడని న్యాయం చేయాలని వినతి పత్రం అందించాడు. ధర్మారావుపేట ఊర చెరువు కొంత కాలంగా స్థానిక లంబాడీలు ఆక్రమించుకుని చేపలు పట్టుకుంటున్నారని, విచారణ చేపట్టాలని గ్రామస్థులు వినతి పత్రం అందించారు.

గురుకులానికి శాశ్వత భవనం కేటాయించాలి

తాండూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంజేపీ గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం కేటాయించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు సోమవారం ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ వినతి పత్రం అందించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అద్దె భవనంలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే శాశ్వత భవనం కేటాయించాలని విన్నవించారు.

ఘనంగా గణిత దినోత్సవం

గర్మిళ్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల లక్ష్మీనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ గణిత ప్రదర్శనలు, గణిత రంగోళి నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. అరవింద్‌రెడ్డి, నాగరాజు, అనగమాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ నెల 25న పాదయాత్ర

గర్మిళ్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఈ నెల 25న ఉదయం 8 గంటలకు పాదయాత్ర చేపడుతామని ధర్మ జాగరణ నాయకుడు కర్ణకంటి రవీందర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ హమాలీవాడ భక్తాంజనేయ స్వామి ఆలయం నుంచి సుందిళ్ల లక్ష్మీనరసింహాస్వామి దేవాలయం వరకు 29 కిలోమీటర్లు 50 మందితో పాదయాత్ర నిర్వహిస్తామన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

జన్నారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం గూడెం అయ్యప్ప ఆలయ వ్యవస్థాపకుడు, గురుస్వామి, చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల ఆధ్వర్యంలో మహా మండల పడి పూజ మహోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు రాజనరేంద్ర శర్మ, కిరణ్ శర్మ, రుకేష్‌శర్మ, సంజయ్ త్రిపాఠిల వేద మంత్రాల మధ్య అయ్యప్ప స్వామి అభిషేకాలు కన్నుల పండగగా జరిగింది. అనంతరం 18 మెట్లను వెలిగించారు. ఆదిలాబాద్‌కు చెందిన దిలీప్ గురుస్వామి భజన బృందం గీతాలు ఆలపించారు. భక్తులకు తీర్థ ప్రసాదం, అల్పాహారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు మహిళలు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ విద్యార్థులకు ప్రత్యేకం.. మైగ్రేషన్

- విద్యార్థుల్లో జాతీయ సమైక్యత పెంపొందించడమే లక్ష్యం
- మధ్యప్రదేశ్‌కు వెళ్లిన కాగజ్‌నగర్ విద్యార్థులు



కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయం



మైగ్రేషన్ ద్వారా వచ్చిన మధ్యప్రదేశ్ విద్యార్థులు

కాగజ్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యంత క్రమశిక్షణతో కూడిన విద్యను అందించే ప్రభుత్వ విద్యాలయాల్లో నవోదయ విద్యాకేంద్రాలు ప్రథమ స్థానంలో ఉంటాయి. అలాంటి నవోదయ విద్యాలయాలు విద్యార్థుల ఉన్నత భవితకు చక్కటి మార్గనిర్దేశం చేస్తుంటాయి. చదువులో భాగంగా ఒక రాష్ట్రంలోని నవోదయ విద్యార్థులు మరో రాష్ట్రంలోని నవోదయ విద్యాలయంలో ఒక సంవత్సరం పాటు చదవాల్సి ఉంటుంది. ఒక ప్రాంతంలోని విభిన్న సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు విద్యార్థులు గమనించడమే ఈ విధానం ముఖ్య ఉద్దేశ్యం. దీనినే మైగ్రేషన్‌గా వ్యవహరిస్తుంటారు. ఈ మైగ్రేషన్‌లో భాగంగా మధ్యప్రదేశ్‌కు చెందిన విద్యార్థుల బృందం కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయానికి చేరుకుంది.

మైగ్రేషన్ పిల్లలకు ప్రత్యేక వసతులు..

రాష్ట్రం కాని రాష్ట్రం నుంచి వచ్చిన విద్యార్థులకు ఇక్కడి నవోదయ విద్యాలయం వారు అన్ని వసతులు ప్రత్యేకంగా కల్పిస్తున్నారు. వారికి భోజనం ఇతర వాటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ప్రతి నెలకొక మారు పట్టణంలో జరిగే వివిధ పండుగలపై కూడా అవగాహన కల్పిస్తారు. ఈ ప్రాంత విద్యార్థులు భోజనంలో అన్నం తినేందుకు ఇష్టపడుతారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన వారికి మాత్రం ప్రత్యేకంగా గోదుమరొట్టెలు ఇస్తారు. ప్రతి ఆదివారం కూడా టీవీ చూసేందుకు హిందీ చానెల్స్‌ను పెడుతుంటారు. లాంగ్వేజ్ బీ కేటగిరిలో వీరందరికి తెలుగు స్పష్టంగా నేర్పుతారు. ఇక్కడి నుంచి వెళ్లిన విద్యార్థులకు కూడా మధ్యప్రదేశ్‌లోని సంస్కృతిక అంశాలు, ప్రత్యేక పర్యాటకకేంద్రాలను విద్యార్థులకు చూపిస్తారు. 9వ తరగతి పూర్తి చేసుకున్న తర్వాత మళ్లీ అంతా యథాస్థానాలకు వెళ్లిపోతారు. ఇందుకు అయ్యే ఖర్చు, ప్రత్యేక ఎస్కార్ట్‌తో అందరినీ క్షేమంగా పంపిస్తారు.

మైగ్రేషన్ కోసం వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిత్యం ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర సిబ్బంది మానిటరింగ్ చేస్తుంటారు. ఎప్పటికప్పుడు ఎలాంటి సమస్యలున్నా వాటిని పరిష్కరిస్తారు.

ఇదీ మైగ్రేషన్ జరిగే ప్రక్రియ..

ప్రతి సంవత్సరం నవోదయలో 8వతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను సంవత్సరం పాటు ఇతరరాష్ట్రాల్లో చదివించేందుకు పంపిస్తారు. ఏడాది పాటు చదువు పూర్తి చేసుకోవటంతో పాటు ఆ రాష్ట్రంలో ఉండే పండుగలు, ప్రత్యేకతలు, సంస్కృతి ఇతర అంశాలపై వారు అవగాహణ పెంచుకొని తిరిగి వస్తారు. ఈసారి మధ్యప్రదేశ్‌లోని శివపురి జవహర్ నవోదయ విద్యాలయం నుంచి 21మంది విద్యార్థులు కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయానికి వచ్చారు. కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం నుంచి 19మంది విద్యార్థులు మధ్యప్రదేశ్‌లోని శివపురి జవహర్ నవోద య విద్యాలయానికి పంపించారు. ఇలా దేశంలోని అన్ని నవోదయ విద్యాలయాల్లో ఈ ప్రక్రియ జరుగుతుంది.

జాతీయ సమైక్యతను పెంపొందించాలన్నది లక్ష్యం..



జాతీయ సమైక్యతను పెంపొందించాలన్న లక్ష్యంతో నవోదయలో మైగ్రేషన్ విధానం అమలులో ఉంది. ఇందులో భాగంగా మధ్య ప్రదేశ్ శివపురి నవోదయ విద్యాలయం నుంచి 21మంది విద్యార్థులు ఇక్కడికి వచ్చారు. వీరికి అన్ని వసతులు కల్పిస్తున్నాం. వీరికి ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, పండుగలు, విధివిధానాలు, ప్రత్యేక పర్యాటకకేంద్రాలపై తెలియజేస్తున్నాం. ఇక్కడ ఏడాదిపాటు చదువుతోపాటు ఈ విషయాలన్నీ నేర్చుకుంటారు. తిరిగి వీరందరిని ప్రత్యేకఎస్కార్ట్‌తో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నవోదయ విద్యాలయాలకు పంపిస్తాం. ఇక్కడ నేర్చుకున్న అంశాలన్నీ ప్రత్యేక సమావేశాల ద్వారా అక్కడి విద్యార్థులందరికీ అవగాహణ పరుస్తారు. తద్వారా ఏయే రాష్ట్రాల్లో ఎటువంటి సంస్కృతి, పండుగలు, పర్యాటక కేంద్రాలు ఉంటాయనేది విద్యార్థులకు తెలుస్తుంది. విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావం పెంపొందించాలన్నదే మైగ్రేషన్ ప్రధాన లక్ష్యం.

-కొడాలి పార్వతి, ప్రిన్సిపాల్, కాగజ్‌నగర్

అన్నీ తెలుసుకుంటున్నాం..



తెలంగాణ రాష్ట్రంలో ఉండే సంస్కృతిక, జీవనవిధానం ఇతరాత్ర అంశాలపై నేర్చుకునేందుకు మధ్యప్రదేశ్‌లోని శివపురినుంచి ఇక్కడికి వచ్చాం. ఇక్కడి వాతావరణం చాలా బాగుంది. తెలుగు బాషపై పట్టు పెంచుకుంటున్నాం. అన్ని వసతులు కల్పిస్తున్నారు. ఇక్కడ పండుగలు జరుపుకునే విధానాలపై సిబ్బంది తెలియజేస్తున్నారు.

-రచన రవాత్, 9వ తరగతి, శివపురి, మధ్యప్రదేశ్

పండుగలపై అవగాహన పెరిగింది..



ఈ ప్రాంత విశిష్టతలు తదితర అంశాలపై సిబ్బంది ఎప్పటికప్పుడు వివరిస్తున్నారు. పండుగలు, సంస్కృతి సంప్రదాయాలపై తెలియజేస్తున్నారు. చాలా బాగా చూసుకుంటున్నారు. ఏ సమస్య వచ్చినా సిబ్బంది పరిష్కరిస్తున్నారు. అన్ని అంశాలను నేర్చుకుంటున్నాను.

-రిషి జటావ్, 9వ తరగతి,శివపురి, మధ్యప్రదేశ్

కొత్తగా అనిపిస్తోంది..



తెలంగాణ రాష్ట్రంలో ఉండే వివిధరకాల పండుగలు, సంస్కృతి పట్ల అవగాహణ పెంచుకుంటున్నాం. ఈ ప్రాంత ప్రజల జీవన విధానంపై తెలుసుకుంటున్నాం. తెలుగు భాషా ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాను. మేము మధ్యప్రదేశ్‌లో ఉదయం, సాయంత్రం భోజనంలో రొట్టె పెట్టేవారు. ఇక్కడ మాత్రం భోజనంలో అన్నం పెడుతున్నారు. చాలా వైవిధ్యం ఉంది. ఈవిషయాలన్నీ మా నవోదయలోని విద్యార్థులకు తెలియజేస్తాం.

-రష్మి అదివాషి, 9వ తరగతి, మధ్యప్రదేశ్

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్: జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం హైదా రాబాద్‌లోని ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ రాష్ట్రకార్య దర్శులకు ఏఐవైఎఫ్, డీవైఎఫ్, కేవీపీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఆయాశాఖలకు సంబంధించిన అధికారులు విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.

అయ్యప్ప స్వాముల ఇరుముడి

ఆసిఫాబాద్ రూరల్:41రోజుల మండల దీక్షపూర్తిచేసుకుని శబరిమలైవెళ్తున్న అయ్యప్ప స్వాములకు సోమవారం జిల్లాకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి ముసునూరి సూర్యభాస్కర శర్మఆధ్వర్యంలో ఇరుముడి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు వేణుగోపాల్, వెంకట్‌గౌడ్, చంద్రమోహన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

లింగాపూర్: మెనూప్రకారం విద్యార్థులకు భోజనంపెట్టాలని తహసీల్దార్ రాజేంద్రప్రసాద్ వర్మ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని వంకామద్ది పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు.

ముగిసిన క్షేత్ర పర్యటన

బెజ్జూరు: హైదరాబాద్ దూలపల్లి ఫారెస్టు అకాడమీలో శిక్షణ పొందుతున్న 36 మంది బీట్‌అధికారులు రెండురోజులుగా మండలంలోని అటవీప్రాంతాల్లో పర్యటించారు. ఇక్కడ పులుల సంరక్షణకోసం తీసుకుంటున్న చర్యలు, వాటి ట్రాకింగ్‌విధానం గురించి అకాడమీకోర్సు అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్ వారికి తెలియజేశారు.

స్థలం మంజూరు చేయాలి

సిర్పూర్(టి): మండలకేంద్రంలో మాలి సంఘం భవననిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని తహసీల్దార్‌శ్రీనివాస్‌కు సోమవారం మాలికులస్తులు వినతిపత్రం అందజేశారు.

బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని బాలుర సంక్షేమగురుకుల పాఠశాలలో విద్యార్థులకు బాల్యవివాహాలు, మాదకద్రవ్యాల నిరోధం, డ్రైవింగ్ లైసెన్సుపై ఎస్సైకమలాకర్ అవ గాహన కల్పించారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు.

28నుంచి టీఎస్‌యూటీఎఫ్ మహాసభలు

కౌటాల:ఈనెల28నుంచి 30వరకు నల్గొండజిల్లాలో జరిగే టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్రఠివ విద్యావైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లాఉపాధ్యక్షుడు ఇందురావ్ కోరారు. సోమవారం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

రెబ్బెన ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

రెబ్బెన: మండల ప్రెస్‌క్లబ్ కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. గౌరవ అధ్యక్షుడుగా ఎస్ సంపత్‌కుమార్, అధ్యక్షుడుగా జె సత్యానారాయణ, ప్రధానకార్యదర్శిగా వినయ్‌కుమార్, ట్రెజరర్‌గా కె రమేష్, ఉపాధ్యక్షుడుగా ప్రకాష్, సంయుక్తకార్యదర్శిగా ఎం విజయ్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం కొత్త కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.



ఘనంగా సింగరేణి ఆవిర్భావ వేడుకలు

శ్రీరాంపూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని పలుగనులు, విభాగాలలో సింగరేణి ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ప్రాజెక్ట్ అధికారి సింగరేణి పతాకాన్ని ఆవిష్కరించి, గేయాన్ని ఆలపించారు. అనంతరం కాలరీ మేనేజర్ బ్రహ్మాజీ మాట్లాడారు. సంస్థను కాపాడుకునేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. సింగరేణి కార్మిక బిడ్డల సంఘం ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ఉన్న కార్మికుడి విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్‌కట్ చేశారు. ఆర్కే6గనిపై మేనేజర్‌తిరుపతి ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేశారు. కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

మందమర్రి టౌన్: మందమర్రి జీఎం కార్యాలయంలో సింగరేణిపాఠశాలలో జీఎం దేవేందర్ జెండాను ఆవిష్కరించారు. వివిధరకాల స్టాల్స్‌ను ప్రారంభించారు. అంతకుముందు గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షురాలు స్వరూపరాణి దేవేందర్, ఎస్‌వోటూ జీఎం విజయప్రసాద్, బ్రాంచి సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: కాసిపేట1,2గనుల్లో సోమవారం సింగరేణి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2వగనిపై కార్మికులు గని మేనేజర్ గొడిసెల లక్ష్మీనారాయణ కేక్‌కట్ చేశారు. సింగరేణి కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధిస్తూ సంస్థ అభివృద్ధికి కృషిచేయాలన్నారు.

రెబ్బెన: రెబ్బెన గోలేటిటౌన్‌షిప్‌లోని శ్రీభీమన్న స్టేడియంలో సోమవారం సింగరేణి ఆవిర్భావదినోత్సవాలను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఏరియా జీఎం శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి పలు స్టాళ్లను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంస్థ మనుగడకు అందరూ సమష్టిగా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా జనరల్‌మేనేజర్ ఎం శ్రీనివాస్, ఏఐటీయూసీ ఏరియాసెక్రెటరి ఎస్ తిరుపతి, అధ్యక్షురాలు ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: జైపూర్‌లోని ఎస్టీపీపీలో సింగరేణి ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఈడీ ఎన్‌వీ రాజశేఖర్‌రావు జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి తెలంగాణ ప్రజలకు ఒక వరమన్నారు. వేడుకల్లో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన ప్రారంభించి పరిశీలించారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన మల్లెల సత్య నారాయణరెడ్డి (ఎస్అండ్‌పీసీ సీనియర్‌ఇన్‌స్పెక్టర్), వైష్ణవి (సీనియర్ అసిస్టెంట్),ఉత్తమ అధికారులుగా కొండ వెంకటయ్య (ఎస్ఈ ఈఅండ్ఎం), నవీన్‌కుమార్ (డీవైఎస్ ఈఈఅండ్ఎం)ను సన్మానించి బహుమతులు అందించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ

అభివృద్ధి పథంలో సింగరేణి సంస్థ

- అట్టహాసంగా ప్రారంభమైన ఆవిర్భావ వేడుకలు
- కార్మికులనుద్దేశించి ప్రసంగించిన వివిధ ఏరియాల జీఎంలు





మాట్లాడుతున్న శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ, మందమర్రి జీఎం దేవేందర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీరాంపూర్ జీఎం సూర్య నారాయణ

శ్రీరాంపూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ వివిధరంగాలకు విస్తరిస్తోందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ అన్నారు. సింగరేణి ఆవిర్భావవేడుకల సందర్భంగా ప్రగతిమైదానంలో ఏర్పాటుచేసిన వేదికపై ఆయన మాట్లాడారు. సంస్థ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్నివేలమంది ఉపాధి పొందుతున్నట్లు చెప్పారు. తట్టా చెమ్మాస్ ద్వారా బొగ్గును వెలికితీసే నాటినుంచి నేడు ఎస్‌డీఎల్ యంత్రాల ద్వారా ఉత్పత్తి చేసేవరకు ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. గత ఏడాది 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించి కార్మికులకు అందులో లాభాల వాటా పంచినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతఆర్థిక సంవత్సరంలో 72మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీసే దిశగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. శ్రీరాంపూర్ ఏరియాలో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యం 6.3 మిలియన్ టన్నులు కాగా, ఇప్పటివరకు 4 మిలియన్ టన్నులు సాధించామన్నారు. ఇంకా 2.3 మిలియన్ టన్నులు వెలికితీయాల్సి ఉందని వివరించారు. ఉద్యోగుల రక్షణ, సంక్షేమానికి సంస్థ పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. అలాగే వారసత్వ ఉద్యోగాలు, విద్య, కార్పొరేట్ వైద్యం, మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉద్యోగుల పిల్లలకు రిజర్వేషన్, స్కాలర్‌షిప్పుల పంపిణీ చేస్తున్నామన్నారు. ఇటీవల కాంట్రాక్ట్ కార్మికులకు సైతం 5వేల రూపాయల లాభాల వాటా పంచినందుకు సీఎండీకి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు. సంస్థ లాభాలు సాధించడంలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమఎంతో ఉందని అభినందించారు. అంతేకాకుండా ఓసీపీల కోసం తమ ఇండ్లు, భూములు ఇచ్చిన వారికి సింగరేణి సంస్థ రుణపడి ఉందన్నారు. దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా సింగరేణికి, ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, 135ఏళ్లుగా సింగరేణిఆధ్వర్యంలో ఉద్యోగఅవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా మాట్లాడుతూ బకాయిపడిన 34వేలకోట్ల రూపాయలు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో పెట్టుబడి పెట్టలేక సంస్థ చతికిలబడే అవకాశం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి ఈసమస్యను పరిష్కరించి సింగరేణిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సేవా అధ్యక్షురాలు ఎల్ మాలతి మాట్లాడుతూ, సేవాసంస్థ ద్వారా యువతులు, మహిళలకు కుట్టుశిక్షణ, మగ్గం, టైలరింగ్, బ్యూటీషియన్, తదితర కోర్సులు, ఇతరులకు వోల్వో డ్రైవింగ్, పోలీసు, ఆర్మీ, ఇతర ఉద్యోగాల కోసం శిక్షణ ఇప్పించామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) పి అరవిందరావు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్ బాబు, ఇతర యూనియన్లనాయకులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఉత్తమఉద్యోగులకు అవార్డులు అందించారు. చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కార్మికులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి,

సింగరేణి చరిత్ర చాలా గొప్పది

-మందమర్రి జీఎం దేవేందర్

మందమర్రిటౌన్: సింగరేణి సంస్థ చరిత్ర చాలా గొప్పదని ప్రత్యక్షంగా,పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కల్పతరువు అని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. సోమవారం రాత్రి సింగరేణి పాఠశాలమైదానంలో నిర్వహించిన సింగరేణి సంస్థ 136వ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరియా లక్ష్యాలను 85శాతం వరకు చేరుకున్నామన్నారు. మందమర్రిలో దాదాపు2వేల మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు స్కిల్ డెవలప్‌సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. సింగరేణి పరిసర ప్రాంతాల అభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్రసత్యనారాయణ మాట్లాడుతూ ప్రతియేటా లాభాలు సాధించడంలో కార్మికులదే కీలకపాత్ర అన్నారు. అనంతరం ఉత్తమ అధికారులు, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కమ్యూనికేషన్ సెల్ కళాకారులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్, పీఎం శ్యాం సుందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్‌లో వేడుకలకు హాజరైన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు



ప్లాస్టిక్ ప్రమాదకారి అంటూ ఓ సామాజిక కార్యకర్త వేషధారణ

ప్రాణహిత-చేవెళ్లపై
చిగురిస్తున్న ఆశలు

5వ పేజీ తరువాయి..

జరిగిన సర్వేలో తేల్చారు. గోదావరి, కృష్ణ, తదితర అన్ని నదుల్లో సహజంగా జూన్ నుంచి నవంబరు వరకే వరద ఉంటుంది. ప్రాణహితలో మాత్రం ఫిబ్రవరిలో కూడా 10 వేల క్యూసెక్కుల దాకా ప్రవాహం ఉంటుంది. దీంతో తుమ్మిడిహెట్టి వైపే కాంగ్రెస్ ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. ఇదిలా ఉండగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ తుది నివేదిక ఆధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై నిర్ణయం తీసుకోవాలని యోచి స్తోంది. ఆయా బ్యారేజీల పునరుద్ధరణ, వాటిలో ఎంత నీటిని నిల్వ చేయాలి..? ప్రాజెక్టుల నిర్వహణ, తదితర అంశాల్లో ఎన్డీఎస్ఏ సూచనలను పాటించాలని భావిస్తోంది.

సుందిళ్లపైనే ఆశలు...

తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీతో సుందిళ్ల బ్యారేజీలోకి నీటిని పంపించవచ్చని అధికారులు తాజాగా అభిప్రాయా నికి వచ్చారు. నెన్నెల మండలంలోని మైలారం వద్ద పంప్‌హౌస్ కట్టి ఎల్లంపల్లిలో నీటిని ఎత్తిపోయాలా..? లేక సుందిళ్లకు గ్రావిటీతో తరలించి, దాని పైనే ఉన్న ఎల్లంపల్లికి ఎత్తిపోయాలా..? అనే దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. మైలారం గ్రామం వద్ద తవ్విన కాల్వలు, పైప్‌లైన్ల ద్వారా నీటిని సహజ సిద్ధంగా ప్రవహించే జైపూర్‌లోని రసూల్‌పల్లె వాగులో కలపడం ద్వారా అక్కడి నుంచి గోదావరిలోకి గ్రావిటీ ద్వారా తరలించే సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. గోదావరి నీటిని సుందిళ్ల బ్యారేజీకి తరలించి, అక్కడి నుంచి నేరుగా ఎగువన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి తక్కువ ఖర్చుతో పంపింగ్ చేసే యోచనలో ప్రభుత్వ యంత్రాం గం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విధానంలో కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయంలోని మిగతా బ్యారేజీలతో పని లేకుండానే ఎగువకు నీరు తరలించే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

బెల్లంపల్లికి చేరుకున్న ప్రజా రగ్ జోల్ యాత్ర



ప్రజా రగ్‌జోల్‌యాత్ర నిర్వహిస్తున్న సేవాలాల్ సేన నాయకులు

బెల్లంపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సేవాలాల్ సేన ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారగ్ జోల్ యాత్ర సోమవారం బెల్లంపల్లికి చేరుకుంది. రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబునాయక్ మాట్లాడుతూ సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. సామాజిక న్యాయం, రాజ్యాధికారం లక్ష్యంతో ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన ప్రతీ వాగ్దానాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సెంట్రల్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు గుగులోత్ మల్లేష్‌నాయక్, రఘురాం రాథోడ్, రెక్యానాయక్, తిరుపతినాయక్, రవి, శాంతి బాయి, సరోజాబాయ్ పాల్గొన్నారు.

విద్యార్థుల పొలం బాట



రైతును సన్మానిస్తున్న విద్యార్థులు, హెచ్‌ఎం

దండేపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం గుడిరేవు పాఠశాల విద్యార్థులను పొలం వద్దకు తీసుకెళ్లి రైతులు, కూలీల మధ్య వేడుకలను నిర్వహించారు. హెచ్‌ఎం బొలిశెట్టి బుచ్చన్న మాట్లాడుతూ దేశానికి అన్నం పెడుతున్నది రైతులేనని అన్నారు. మాజీ ప్రధాని డాక్టర్ చౌదరి చరణ్‌సింగ్ జన్మదినం సందర్భంగా రైతు దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. ఉపాధ్యాయురాలు శ్యామల, అంగన్‌వాడి టీచర్ లక్ష్మి, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నెముక రైతన్న అని బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గందె రాంచందర్, సీనియర్ నాయకులు కొమురయ్య పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఒకే దఫాలో రూ.2 లక్షల రుణమాఫీ చేశారన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ

మందమర్రి టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా నిలవాలని మా ఊరు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండి ఇబ్రహీం, సభ్యుడు మల్లన్నలు తెలిపారు. సోమవారం ఊరు మందమర్రిలో పేదలకు సరుకులను పంపిణీ చేశారు. ముజాహిద్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



సోమగూడెంలో విద్యుత్ దీపాలతో ముస్తాబైన కల్వరీ చర్చీ



మందమర్రి ముస్తాబైన సీఎస్ఐ చర్చి



క్యారల్స్ కార్యక్రమంలో క్రిస్మస్ తాత

ముస్తాబైన చర్చిలు

- రేపు క్రిస్మస్
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : యేసుక్రీస్తు పుట్టిన రోజునే ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పండుగను జరుపుకుంటారు. క్రిస్మస్ రోజున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్‌కట్ చేసి వేడుకలను జరుపు కుంటారు. జిల్లాలో క్రిస్మస్ వేడుకలకు సర్వత్రా చర్చిలు సిద్ధమయ్యాయి. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంక రించారు. క్రైస్తవులు ఇంటి ఎదుట స్టార్‌లను, వివిధ వస్తువులను కొనుగోలుచేసి గృహాల్లో అలంక రించు కోవడంలో నిమగ్నమయ్యారు. మార్కెట్‌లో స్టార్ బొమ్మల కు వంద రూపాయల నుంచి 500 రూపాయలకు పైగా ధరలు పలుకుతున్నాయి. క్రిస్మస్ ట్రీల ఎత్తును, సైజును బట్టి వంద నుంచి 2వేల రూపాయల వరకు ఉన్నాయి. డెకరేషన్ వస్తువులు, క్రిస్మస్ శాంతా క్లాజ్, క్రీస్తు ఫోటోలు, తర్మకోల్‌షీట్లు, పలు ప్రతిమలు అమ్ముతున్నారు.

జిల్లా కేంద్రంలో సీఎస్ఐ, క్యాతలిక్ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు..


1964లో ఫాదర్ జోసెఫ్ చేతుల మీదుగా జిల్లా కేంద్రంలో సెకరెట్ హార్ట్ క్యాతలిక్ చర్చిని ప్రారంభించారు. బెల్లంపల్లి చౌరస్తాలో 1982లో నిర్మాణం చేపట్టి 1991 లో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ నెల 24వ తేదీన క్రైస్తవ విశ్వాసులు గుడి ఆవరణలో పశువుల పాకను ఏర్పాటు చేస్తారు. రాత్రి నుంచి ప్రార్థనలు ఉదయం వరకు కొనసాగుతాయి. వేడుకల్లో క్రైస్తవ సోదరులు పాల్గొంటారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీఎస్ఐ (చర్చ్‌ఆఫ్‌సౌత్ ఇండియా) చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. ఈ చర్చ్‌కు దశాబ్దాల చరిత్ర ఉంది. 1954లో ఇంగ్లాండ్‌కు చెందిన రెవరెండ్ డాక్టర్ డబ్ల్యూఈ సంగస్టర్ చర్చి నిర్మాణానికి భూమి పూజ చేశారు. 1958లో నిర్మాణం పూర్తి చేసుకుని చర్చి అందుబాటులోకి వచ్చింది. క్రైస్తవులు ఎంతో నమ్మకంతో నిత్యం ప్రార్థనలు చేస్తుంటారు. ఈ చర్చిలో వివాహం చేసుకున్న దంపతులకు సంసార జీవనం సాఫీగా సాగుతుందని విశ్వాసం నెలకొంది. ఎక్కువ మంది క్రైస్తవులు ఇక్కడ వివాహాలు చేసుకుంటారు. క్రిస్మస్ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి క్రైస్తవులు తరలి వచ్చి ప్రార్థనలు నిర్వహిస్తారు.



కల్వరి చర్చీలో ఏర్పాటు చేసిన పశువుల పాక



బెల్లంపల్లిలోని సీఎస్ఐ చర్చి

జిల్లా కేంద్రంలో అతి పురాతన చర్చి....

జిల్లా కేంద్రంలోని హమాలివాడలో గల చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) పురాతనమైనది. బ్రిటీషు వారు 1938లో క్రైస్తవ ఆలయాన్ని ఏర్పాటు చేశారు. 1970లో ఫాదర్ జాన్ నేతృత్వంలో చర్చిని పునః నిర్మించారు. సుమారు 15ఎకరాల విస్తీర్ణంలో చర్చి ఉండడం, భక్తులు అనేక మంది ప్రార్థనలు చేస్తూ ఇక్కడే భోజనాలు ఏర్పాటు చేస్తారు. యేటా డిసెంబరు 13న చర్చి వార్షికోత్సవాన్ని నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తారు. క్రిస్మస్ రోజున జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా నుంచి క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తూ గీతాలు ఆలపిస్తారు.

ప్రతీ ఒక్కరు ఐక్యతతో వర్ధిల్లాలి..



క్రిస్మస్ వేడుకలు శాంతి, సౌభ్రాతృత్వాన్ని సూచిస్తుంది. అన్ని మతాల వారు కలిసి ఉండాలి. ఏ మత గ్రంథమైనా ప్రజలను ఐక్యంగా ఉంచేందుకు ఉపకరి స్తుంది. సెకెరెట్ క్యాతలిక్ చర్చి ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు నిర్వహిస్తాం.

- ఫాదర్ జోస్

కాసిపేటలో..

కాసిపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు మండలంలోని చర్చీలన్నీ ముస్తాబు చేశారు. క్రీస్తు పుట్టుకను సూచించే తోక చుక్కను క్రైస్తవులు ఇండ్లు, చర్చీలపై అలంకరించారు. పశువుల పాకలో క్రీస్తు జన్మించడంతో చర్చీల వద్ద పశువుల పాకలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సోమగూడెం కల్వరీ చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. 1996లో ప్రారంభమైన కల్వరీ మిని స్ట్రీస్ చర్చీ అంత ర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. డిసెంబరు నెలలో నిర్వహించే ఉపవాస ప్రార్థనలకు దేశవిదేశాల నుంచి సుమారు 10లక్షల మంది భక్తులు హాజర వుతారు. ప్రత్యేక ప్రార్థనల ద్వారా చాలామంది స్వస్తత పొందడంతో శని, ఆదివారాల్లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటకలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హాజరవుతుంటారు. కల్వరి చర్చీ నిర్వాహకులు పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్‌ల ఆధ్వర్యంలో నిత్యాన్నదానం నిర్వహిస్తారు. క్రిస్మస్ సందర్భంగా చర్చీ వద్ద క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు.

దండేపల్లిలో ..

దండేపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు జన్మదినం పురస్కరించుకొని మండలంలోని సీఎస్ఐ, ఎలీమ్ చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. రంగు రంగుల విద్యుత్ దీపాలు, కలర్స్ పేపర్స్‌తో ముస్తాబు చేశారు. బుధవారం చర్చిలో ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

మందమర్రిలో ..

మందమర్రిటౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు పట్టణంలోని చర్చిలన్ని ముస్తాబయ్యాయి. పట్టణంలోని మార్కెట్ ఏరియా సీఎస్ఐని విద్యుత్ కాంతుల కొత్తశోభను సంతరించుకుంది. చర్చిని 1974 లో నిర్మించగా ఇటీవలే 50వసంతాల వేడుక పూర్తి చేసుకుంది. క్రిస్మస్ వేడుకలకు వేలాది మంది హాజరవుతారు. పట్టణంలోని కార్మెల్ హైస్కూల్ ఆవరణలో గల చర్చి కూడా వేడుకలకు ముస్తాబైంది. వారం పాటు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. పట్టణంలోని మూడో జోన్‌లోని చర్చి కూడా వేడుకలకు ముస్తాబైంది. చర్చికి ముఖద్వారంతో పాటు లైన్ చివరన కూడా స్టార్‌లు కట్టారు. విద్యుత్ కాంతులతో చర్చిని అలంకరించారు.



మంచిర్యాలలో ముస్తాబైన సెకెరెట్ హార్ట్ చర్చి



మంచిర్యాల సీఎస్ఐ చర్చి



దండేపల్లి : ముస్తాబైన నెల్కివెంకటపూర్ సీఎస్ఐ చర్చి

వాలీబాల్ ఎంపిక పోటీలు



ఎంపికైన జట్టుతో పోటీల నిర్వాహకులు

గర్మిళ్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల మైదానంలో సీఎం కప్ వాలీబాల్ ఎంపిక పోటీలను నిర్వహించారు. పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ బాల బాలికల జట్టు ఎంపిక చేసినట్లు డీవైఎస్‌వో రాజ్‌వీరు తెలిపారు. ఈనెల 7 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల శంకర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల కోసం ఎల్‌వోసీ అందజేత

దండేపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రెబ్బనపల్లి గ్రామానికి చెందిన బండ ప్రకాష్ వైద్య ఖర్చుల కోసం లక్షా యాభై వేల రూపాయల ఎల్‌వోసీని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అందజేశారు. వైద్య ఖర్చుల కోసం నాయకులు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సోమవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో ఎల్‌వోసి పత్రాన్ని డీసీసీ అధ్యక్షురాలు అందజేశారు.

మహాసభలను విజయవంతం చేయండి

కోటపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్‌లో జనవరి 5, 6, 7 తేదీల్లో జరిగే అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం జాతీయ 2వ మహాసభలను విజయవంతం చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ దళిత వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు నేటికి వారి దరి చేరడం లేదన్నారు. అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గజ్జల తిరుపతి, రవి, పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభల పోస్టర్ల విడుదల

బెల్లంపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో ఈ నెల 28,29,30 తేదీల్లో జరిగే టీఎస్‌యూటీఎఫ్ మహాసభల పోస్టర్లను సోమవారం బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సభలో విద్యారంగం బలోపేతం, ప్రభుత్వ విద్యలో ఉన్న సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సభలను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి దేవదాసు, సభ్యులు లత, తిరుపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలి



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్, కలెక్టర్ కుమార్‌దీపక్

భీమారం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో ప్రజలు అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం రైతువేదిక ప్రాంగణంలో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు అంబులెన్స్‌ను ప్రారంభించామన్నారు. ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తుందని, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తుందన్నారు.

డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, నాయ కులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, పోడేటి రవి, మోహన్‌రెడ్డి, లక్ష్మణ్, అమర్‌సింగ్, రవి తేజ, రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొ న్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పనులను కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. పనులు నత్తనడకన సాగడంపై కాంట్రా క్టర్‌పై అసహనం వ్యక్తం చేశారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారని ఎమ్మెల్యే వినోద్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యా ణలక్ష్మీ, షాదీము బారక్ చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తుం దన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పేదల అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తు న్నారన్నారు. 195 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, పట్టణాధ్యక్షుడు మల్లయ్య, నాయకులు స్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ, న్యూడెమోక్రసీ నాయకులు

నస్పూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఎస్ఎఫ్ఐ నాయకులు అభినవ్, బండి సత్యనారాయణ, ద్యాగం శ్రీకాంత్‌లు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోకి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యార్థులు అధికారికి అందించారు. నాయకులు నిఖిల్, సాయి, రాజ్ కుమార్, శ్రావణి, సౌజన్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో పేదలకు ఇండ్లు కేటాయించాలి

జన్నారం మండలం చింతగూడ సర్వే నంబరు 81లోని ప్రభుత్వ భూమిలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ ఏవో రాజేశ్వర్‌రావుకు అందించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ భూమి అక్రమణకు గురవుతుందన్నారు. భూమిని సర్వే చేయించి అర్హులైన పేదలకు కేటాయించాలన్నారు. శ్రీనివాస్, లాల్‌కుమార్, బ్రహ్మానందం, మల్లయ్య, పాల్గొన్నారు.

డీఈవోకు వినతి..

మోడల్ స్కూల్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డీఈవో యాదయ్యకు భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు) నాయకులు వినతిపత్రం అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం మాట్లాడుతూ సమగ్ర శిక్షలో టైప్-4, కేజీబీవి, మోడల్స్ హాస్టల్స్, స్కూళ్ళలో తక్కువ వేతనాలతో ఏళ్ళ తరబడి పని చేస్తున్నారన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

గర్మిళ్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జూనియర్ బాలికల జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్‌లు తెలిపారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1 వరకు ఆర్మూర్‌లో జరిగిన పోటీల్లో శివాత్మిక, హాసిని, సింధూజలు ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 24 నుంచి 28 వరకు తమిళనాడులో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, సెవెన్‌హిల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మీ, చరణ్, కోచ్‌లు అరవింద్, కళ్యాణ్, శేఖర్, రాజేష్‌లు అభినందించారు.

సీఎం కప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మదర్‌థెరిస్సా పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కరస్పాండెంట్, పీఈటీ

దండేపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలో కన్నెపల్లి మదర్‌థెరిస్సా పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. సోమవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఫాదర్ అనూప్‌జార్జ్, మేనేజర్ ఫాదర్ షైన్, కరస్పాండెంట్ ఫాదర్ లింటూ, వ్యాయమ ఉపాధ్యాయురాలు సుద్దాల దీపిక అభినందించారు.



సోమగూడెంలో విద్యుత్ దీప కాంతులతో ముస్తాబైన కల్వరీ చర్చి

ముస్తాబైన చర్చిలు

- రేపు క్రిస్మస్
- ప్రత్యేక ప్రార్ధనలకు ఏర్పాట్లు

7

జవహర్ నవోదయ విద్యార్థులకు ప్రత్యేకం మైగ్రేషన్

- విద్యార్థుల్లో జాతీయ సమైఖ్యత పెంపొందించడమే లక్ష్యం
- మధ్యప్రదేశ్‌కు వెళ్లిన కాగజ్‌నగర్ విద్యార్థులు

6



నవోదయ విద్యాలయ ప్రధాన ద్వారం

పత్తి కొనుగోలు నిలిపివేత

తాండూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ సెలవుల సందర్భంగా ఈనెల 25, 26 తేదీల్లో రేపల్లెవాడ జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ పత్తి కొనుగోలు నిలిపివేస్తుందని బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించాలని సూచించారు. ఈనెల 27 నుంచి మార్కెట్‌లో బీబీ స్పెషల్ మోడ్ రకం వస్తున్నందున రూ. 7471 మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి దీక్షను విజయవంతం చేయండి


కాసిపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓరియంట్ సిమెంట్ కంపెనీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం కంపెనీ గేటు ఎదుట చేపట్టే ఒకరోజు దీక్షను విజయవంతం చేయాలని కార్మిక సంఘం నాయకుడు భీమ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నాలుగో ప్లాంటు విస్తరణలో 4 వేల మందికి ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేదన్నారు. ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం మాజీ అధ్యక్షుడు రాములు నాయక్ ఆధ్వర్యంలో చేపట్టే దీక్షకు కార్మికులు, నాయకులు, నిరుద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

స్థలం కేటాయించాలి

భీమారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ ఎంపీవో సతీష్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. 108 అంబులెన్స్ ప్రజలకు చేరువలో ఉండేలా చూడాలన్నారు. తిరుపతి, బబ్లు తదితరులు పాల్గొన్నారు.



నెన్నెల మండలం జంగల్‌పేట వద్ద తవ్విన ప్రాణహిత కాలువ



ప్రాజెక్టు రూట్ మ్యాపు

ప్రాణహిత-చేవెళ్లపై చిగురిస్తున్న ఆశలు

- తుమ్మిడిహెట్టిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి
- వ్యాప్కోస్ నివేదిక పునఃపరిశీలన ఆధారంగా డీపీఆర్
- సుందిళ్లకు గ్రావిటీతో నీరందించేందుకు ప్రణాళిక

మంచిర్యాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కంటే తుమ్మిడిహెట్టి బ్యారేజీ ద్వారానే తక్కువ ఖర్చుతో గోదావరి జలాలను ఎత్తిపోయవచ్చని ముందు నుంచి కాంగ్రెస్ పార్టీ పేర్కొంటుంది. అందుకు అనుగుణంగా ఆ ప్రాజెక్టును నిర్మించేందుకు అడుగులు వేస్తోంది. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మించేందుకు సన్నాహాలను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు నిర్మించడం ద్వారా ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయనున్నట్లు ఇటీవల పెద్దపల్లిలో జరిగిన బహిరంగ సభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. దీంతో తుమ్మిడిహెట్టిపై ఆశలు చిగురిస్తున్నాయి. తుమ్మిడిహెట్టిపై కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ గతంలో చేసిన సర్వే ఫలితాలను పునః పరిశీలన చేయించే పనిలో రాష్ట్ర ప్రభుత్వం పడింది.

ఆ ఫలితాల ఆధారంగా డీపీఆర్‌కు తుదిరూపు ఇచ్చి, అను మతుల కోసం కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ)లో దాఖలు చేయ నుంది. గతంలో తుమ్మిడి హెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించాలని ప్రతిపాదించగా తాజాగా గ్రావిటీతో సుందిళ్ల బ్యారేజీకి నీటిని తరలించాలనే కొత్త ప్రతిపాద నను ప్రభుత్వం తెరమీదకి తెచ్చింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ప్రతిపాదిత ప్రాంతం నుంచి 71.5 కిలోమీటర్ల వరకు కాలువల నిర్మాణం కూడా గతంలోనే పూర్త యింది. ఇక బ్యారేజీ నిర్మాణమే తరువాయి అనే పరిస్థితి లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హఠాత్తుగా ప్రాజెక్టును రద్దు చేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నట్లు బ్యారేజీ నిర్మాణం జరిగితే తుమ్మిడిహెట్టి నుంచి నెన్నెల మండలం మైలారం గ్రామం వరకు 71.5కిలో మీటర్ల దూరం మోటార్లు లేకుండా నీరు గ్రావిటీతో రానుంది. అక్కడ నుంచి తక్కువ సామర్థ్యం కలిగిన పంపుల ద్వారా ఎల్లంపల్లికి నీటిని తరలించవచ్చని గతంలో ప్రతిపాదించారు.

మహారాష్ట్ర అభ్యంతరాలతో...

ఉమ్మడి రాష్ట్రంలో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును 152 మీటర్ల ఎత్తుతో కట్టాలని ప్రతిపాదించగా ముంపు అధికంగా ఉంటుందనే మహారాష్ట్ర అభ్యంతరాలతో పక్కన పెట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 148 టీఎంసీ సామర్థ్యంతో ప్రాజెక్టును కడతామని అప్పటి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో నాటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒప్పందం చేసుకున్నారు. దీనికి మహారాష్ట్ర అంగీకారం తెలుపుతూ సంతకాలు చేసింది. కాళేశ్వరంతో పాటే తుమ్మిడిహెట్టిని కడతామని కేసీఆర్ ప్రకటించారు. తర్వాత తుమ్మిడిహెట్టి కాలగర్భంలో కలిసిపోయింది. వన్యప్రాణుల అభయారణ్యం, సాంకేతిక అంశాలు, నీటి లభ్యత లేదనే కారణాలతో ప్రాజెక్టును పక్కనబెట్టారు. తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత ఉందని ఉమ్మడి రాష్ట్రంలో..

మిగతా 7లో

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్మస్ పండగను సంతోషంగా జరుపుకోవాలని, క్రైస్తవుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, ఏసీపీ రవి కుమార్, పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, కారుకూరి రాంచందర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 14వ రోజు చేరింది. కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. తమ డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని జేఏసీ అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్నలు డిమాండ్ చేశారు. శిబిరాన్ని సీపీఎం నాయకులు బోడంకి చందు, దాసరి రాజేశ్వరిలు సందర్శించి మద్దతు తెలిపారు.

ఏఎస్ఆర్‌బీలో మూడో ర్యాంకు సాధించిన లావణ్య



లావణ్య

చెన్నూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు మండలం గంగారం గ్రామానికి చెందిన డాక్టర్ ధరంశెట్టి లావణ్య సైంటిస్టుగా ఎంపికైంది. ఇటీవల అగ్రికల్చర్ సైంటిస్టు రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏఎస్ఆర్‌బీ) ఆలిండియా స్థాయిలో సైంటిస్టుల ఎంపిక పరీక్ష నిర్వహించింది. లావణ్య ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీటెక్ పూర్తి చేసింది. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఎంటెక్ పూర్తి చేసింది. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ (సీఐఏఈ) భోపాల్‌లో ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ) న్యూ ఢిల్లీ నుంచి మైక్రో ఇన్‌క్యాప్సులేషన్ ఆఫ్ పాపాయలిఫ్ ఎక్స్ ట్రాక్ట్‌పై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందింది. లావణ్య సైంటిస్టుగా ఎంపిక కావడంతో నియోజకవర్గ, మండల, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతోనే ఎంపికయ్యానని లావణ్య పేర్కొంది.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన దరఖాస్తులను అధికారులు సమన్వయంతో త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణలతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. వేలాల శివారు ఇసుక క్వారీలో అవకతవకలు నెలకొన్నాయని జాడి యేసయ్య దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని రాంనగర్‌కు చెందిన బొమ్మకంటి శ్రీనివాస్ భూమి వివరాలు ధరణిలో నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలన్నారు. దండేపల్లి మండలం రాజంపేటకు చెందిన జాడి కళ్యాణ్ చక్రవర్తి లక్సెట్టిపేట మండలం వెంకట్రావుపేట శివారులో వారసత్వంగా వచ్చిన భూమిని కొందరు ఆక్రమించుకొన్నారని, న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. తాండూర్ మండలం కాసిపేటకు చెందిన సుంకరి విక్రమ్ తండ్రి పేరిట భూమిని కొందరు ఆక్రమించుకొన్నారని, న్యాయం చేయాలని కోరారు. అధికారులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ పనుల వివరాలు నమోదు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జల శక్తి అభియాన్ కింద జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ పనులకు సంబంధించిన వివరాలను శాఖల వారీగా జల్ సంచాయ్ పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్‌లో మున్సిపల్, అటవీ శాఖ అధికారులతో జల శక్తి అభియాన్ కార్యక్రమం కింద చేపట్టిన పనులపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జల శక్తి అభియాన్ కింద జల్ సంచాయ్ - జన్ భగీరథి కార్యక్రమంలో భాగంగా మార్చి నుంచి చేపట్టిన పనులకు సంబంధించి శాఖల వారీగా ప్రభుత్వం వివరాలు సేకరించి పోర్టల్‌లో నమోదు చేయాలని, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారని తెలిపారు.

అట్టహాసంగా సింగరేణి ఆవిర్భావ వేడుకలు

- మందమర్రి, శ్రీరాంపూర్‌లో పాల్గొన్న జీఎంలు
- తరలివచ్చిన కార్మికులు, ప్రజలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వివరాలు 6లో



శ్రీరాంపూర్‌లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు



మందమర్రిలో కమ్యూనికేషన్ సెల్ కళాకారులు

అన్యమత ప్రచారాన్ని అడ్డుకున్న స్థానికులు

జన్నారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సోమవారం క్రైస్తవ పాస్టర్లు కరపత్రాలు అందజేస్తూ అన్యమత ప్రచారం చేస్తుండగా హిందూవాహిని సభ్యులు అడ్డుకున్నారు. దీంతో క్రైస్తవ పాస్టర్లు అక్కడ నుంచి వెళ్లిపోయారు. హిందూవాహిని ప్రముఖ్ కొండగొర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ అన్యమత ప్రచారం చేస్తూ మతమార్పిడికి ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సభ్యులు కృష్ణ, శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

దండేపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కోయపోచగూడ ఆదివాసి గిరిజన పేదలు పోడు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. సోమవారం కోయపోచగూడలో ఆదివాసి గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోడు భూములకు హక్కు పట్టాలివ్వాలని పలుమార్లు మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలను అందజేశామన్నారు. ప్రభుత్వం హక్కు పత్రాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ప్రభుత్వం స్పందించి పోడు భూములకు పట్టాలిచ్చి, బ్యాంకు రుణాలు ఇప్పించాలన్నారు. గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప మిగితా పథకాలను అమలు చేయలేదన్నారు. నాయకులు కనికారపు అశోక్, ఎల్లయ్య, దుంపల రంజిత్‌కుమార్, రమేష్, మహేశ్వరి, శ్యామల, పాల్గొన్నారు.

పోడు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి

వేమనపల్లి, (ఆంధ్రజ్యోతి): చామనపల్లి గ్రామ శివారులో పోడు భూములకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని సోమవారం గ్రామ గిరిజనులు ఉట్నూరులో ఐటీడీఏ పీవో కుష్బూగుప్తాకు వినతిపత్రం అందించారు. ఆదివాసీ జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం ఆధ్వర్యంలో గిరిజనులు ఉట్నూరుకు వెళ్లి పీవోకు వినతిపత్రం అందించారు. గిరిజనులు మాట్లాడుతూ ఏండ్ల తరబడి భూములను సాగు చేసుకుంటున్నామని, వాటికి గత ప్రభుత్వాలు హక్కు పత్రాలు ఇచ్చాయన్నారు. హక్కు పత్రాలు ఉన్నా బ్యాంకు అధికారులు పంట రుణాలు ఇవ్వకపోవడంతో వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు తెచ్చి పంటలను సాగు చేసుకుంటున్నామన్నారు. ఇప్పటికైనా హక్కు పత్రాలు ఉన్న వారందరికి బ్యాంకు రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఉట్నూరులో ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

ఘనంగా అనగాష్టమి వ్రతాలు

గర్మిళ్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల గోదావరి తీరంలోని గౌతమేశ్వర ఆలయంలో మార్గశిర మాసం సందర్భంగా 1080 మందితో సామూహిక అనగాష్టమి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. వేద పండితులు వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంచిర్యాల నుంచే కాకుండా పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయ ఫౌండర్ గోపిగాని శ్రీదేవి,నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీనివాస్, వంశీకృష్ణ, రాజేంద్ర ప్రసాద్, రాజు, గాయత్రి రమేష్ పాల్గొన్నారు.



నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నస్పూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు మండలం బాబూరావుపేట శివారులో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇంటి పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ ఏవోకు అందించారు. ప్రధాన రహదారి నుంచి కలెక్టరేట్ వరకు ఊరేగింపుగా తరలివచ్చారు. నాయకులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళు, రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలన్నారు. రెండు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఏరియా కార్యదర్శి బోడెంకి చందు, నాయకులు శ్యామల, ఉమారాణి, సీడం సమ్మక్క, నాగజ్యోతి, రవి, శారద, సరిత, రాజేశ్వరి, రాములు, రమాదేవి పాల్గొన్నారు.

ఏజెన్సీ దళితులకు గిరిజనులతో సమాన హక్కులు కల్పించాలి

కోటపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ దళితులకు గిరిజనులతో సమాన హక్కులు కల్పించాలని సోమవారం ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామికి సమతా సైనిక్ దళ్ నాయకులు దుర్గం నగేష్ వినతిపత్రం అందించారు. షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనులతో మమేకమై నివసిస్తున్నా భూమిపై హక్కులు, రాజకీయ రిజర్వేషన్‌లు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో సుమారు 12 లక్షల జనాబా ఉందని, దీనిపై అసెంబ్లీ, పార్లమెంట్‌లో ప్రస్తావించి ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు.

వైభవంగా కాలభైరవ జయంతి



భైరవ స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, ప్రవచనాలు వినిపిస్తున్న సంతోష్‌కుమార్ శాస్త్రి

కోటపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పారుపెల్లి భైరవస్వామి ఆలయంలో సోమవారం కాలభైరవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పారుపెల్లి, చెన్నూరు, మంచిర్యాల తదితర పట్టణాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలతోపాటు మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా స్వామి వారికి అభిషేకం, సింధూర లేపనం, వస్త్రాలంకరణం, పుష్పార్చన, మంగళహారతి, నైవేద్యం లాంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శృంగేరి శారదపీఠం ఆస్థాన పౌరాణికులు బాసంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి భక్తులకు ప్రవచనాలు వినిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి భైరవున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ నిర్వహకులు శాలువాలతో సత్కరించారు. ఆలయానికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని, ఆలయంలో పూజారిని నియమించాలని స్థానికులు కోరగా ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.